సాక్షి
బాపట్ల
గురువారం । 5 । డిసెంబర్ । 2024



శబరిమలకు అయ్యప్పస్వాములు

నత్తెనపల్లి: విఘ్నేశ్వర అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు 200 మంది బుధవారం ఇరుముడి కట్టించుకొని శబరిమలకు బయలుదేరారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1,902 క్యూసెక్కులు విడుదల చేశారు. స్థానిక కెనాల్స్‌కు కూడా నీటిని విడుదల చేశారు.

గజాననుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామి ఆలయం వద్ద గజాననుడికి బుధవారం మార్గశిర మాస చవితిని పురస్కరించుకొని అర్చకులు ఉమాపతి శాస్త్రి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కొలుసు

బాపట్ల: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి గురువారం బాపట్ల జిల్లాకు వస్తున్నారని జేసీ ప్రఖర్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం జంపని గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఉదయం 9:30 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పరిశీలిస్తారని ఆయన తెలిపారు. అనంతరం ముగ్గురు మంత్రులు బాపట్ల పట్టణానికి చేరుకుంటారని పేర్కొన్నారు. మెగా పేరెంట్ అండ్ టీచర్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలకు వస్తున్న సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తారని జేసీ తెలిపారు.

హత్య కేసు కొట్టివేత

సంతమాగులూరు (అద్దంకి): హత్య కేసును కొట్టివేస్తూ సెవెన్త్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సంతమాగులూరుకు చెందిన గద్దం వెంకటరెడ్డి 10 ఏప్రిల్ 2016లో ఇంట్లోనే దారుణంగా హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నేరారోపణ చేసిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేశారు. ఈమేరకు ఒంగోలులోని సెవెన్త్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి కేసును కొట్టివేస్తూ బుధవారం తీర్పును వెలువరించారు. సంచలనం రేపిన హత్య కేసులో నిందితులుగా ఉన్న అట్లా చిన వెంకటరెడ్డి, అట్లా పెద వెంకరెడ్డి, అట్లా చిన శ్రీనివాసరెడ్డి, టి. ప్రభాకర్‌రెడ్డి, కొండారెడ్డి సత్యనారాయణరెడ్డి, దేవసాని వీరారెడ్డి నిర్దోషులని ఏనిమిదేళ్ల తరువాత కోర్టు తీర్పు వెలువరించింది. కాగా నిందితుల్లో ఒకరైన దేవసాని వీరారెడ్డి గతంలోనే మృతి చెందాడు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి ముఖ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్ఏ 2024–25) కార్యాచరణ ప్రణాళికపై గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జ్యోతిబసు మాట్లాడుతూ... ఈ తరహా శిక్షణ ద్వారా శాఖల సమన్వయం, సిబ్బంది సహకారంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. జిల్లా పంచాయతీ అధికారి బీఎస్ సాయికుమార్ మాట్లాడుతూ పథకాల సమర్థ అమలుతో గ్రామీణాభివృద్ధి సాధ్యమన్నారు. ఎస్ఐఆర్డీ కన్సల్టెంట్ డాక్టర్ కె. మోహన్‌రావు మాట్లాడుతూ.. పంచాయతీలను ఉత్తమంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బాపట్ల ఈటీసీ శిక్షణ కేంద్ర ప్రిన్సిపల్ డి.వెంకట్రావు, డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త ఎస్.పద్మారాణి, రిసోర్స్ పర్సన్లు పి.రామకృష్ణ, డాక్టర్ వి.వరప్రసాద్, షేక్ షఫీ, ఎస్.కొండయ్య, ఎస్.వెంకటరమణ, నోడల్ అధికారి శ్రీవాణి, కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పల్నాటి వీరారాధన ఉత్సవాలు



కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైన వీరుల ఆయుధాల గ్రామోత్సవం బుధవారం తెల్లవారుజాము వరకు సాగింది. ప్రజలు పల్నాటి వీరుల ఆయుధాలకు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. అనంతరం వీరాచారులు నాగులేరు గంగధారి మడుగులో ఆయుధాలను శుభ్రం చేసుకున్నారు. చెన్నకేశవస్వామి గుడి వద్ద పీఠాధిపతి ఇచ్చిన శంఖుతీర్థాన్ని స్వీకరించారు. అంకాలమ్మ తల్లి గుడిలోనూ తీర్థం తీసుకున్నారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవతో కలిసి వీధుల్లో పరుగులు తీస్తూ నాయకురాలు నాగమ్మ వేషంలో ఉన్న ఆచారవంతుని తరుముకుంటూ వీరుల గుడి ఆవరణలో ఉన్న లంకన్న ఒరుగు ఘటనాస్థలానికి చేరుకున్నారు.లంకన్నకు బ్రహ్మనాయుడు ప్రాణప్రతిష్ట చేసిన ఘట్టాన్ని నాటకీయంగా ప్రదర్శించారు. తర్వాత కళ్లిపోతురాజు మండపం వద్ద ఏర్పాటు చేసిన కళ్లిమండెపై వీరుల ఆయుధాలు కళ్లికి ఒరగడంతో ఉత్సవం ముగిసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. కళ్లి మండెలోని ఆకుల మండలను పోటీపడి తీసుకుని వీరాచారులు తమ నివాసస్థలాలకు తిరుగు పయనమయ్యారు.

ట్యాబ్లెట్స్.. నో స్టాక్



కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి చెందిన కోడూరు వెంకటరమణ కాలికి ఇన్‌ఫెక్షన్ వచ్చి వైద్యం కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు వచ్చింది. పరిశీలించిన డాక్టర్ మందులు రాసి ఆస్పత్రి మెడికల్ స్టోర్‌లో తీసుకోమన్నారు. అక్కడ టాబ్లెట్స్ మాత్రమే ఇచ్చారు. కాలి పుండుకు పూసే ప్రధాన ఆయింట్‌మెంట్ లేదని, బయట మెడికల్ షాపులో కొనుక్కోవాలని చెప్పారు. చేసేదేమీలేక వెంకటరమణ బయట షాపులో కొనుక్కుంది.

బాపట్ల పట్టణానికి చెందిన జ్యోతి నడుం నొప్పితో బాపట్ల ఏరియా వైద్యశాలకు వచ్చి డాక్టర్‌కు చూపించుకొంది. పరిశీలించి మందులు రాశారు. డ్రగ్ స్టోర్‌లో పెయిన్ కిల్లర్ మందులు లేవని, బయట మెడికల్ షాపులో కొనుక్కోమని సిబ్బంది చెప్పారు. గత్యంతరం లేక జ్యోతి బయట కొనుక్కుంది.

- కొన్ని మందులే ఇచ్చి చేతులు దులుపుకుంటున్న వైనం
- మిగిలినవి బయట కొనుక్కోవాలంటూ సూచన
- సీటీ స్కాన్, ఎంఆర్ఐ కావాలంటే గుంటూరు వెళ్లాలి
- తరలించేందుకు అంబులెన్స్ లేదు
- సకాలంలో అందని మెడికల్, సర్జికల్ బడ్జెట్
- ఆపరేషన్లకు ఇక్కట్లు
- మార్చురీలో ఫ్రీజర్లు కరువు
- వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ. 4 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కూటమి సర్కార్ పాలనలో పేదలకు ప్రభుత్వ వైద్య సేవలు సక్రమంగా అందడంలేదు. మందులతో పాటు వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బాపట్ల ఏరియా ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఉదాహరణకు ఫ్యాంటాప్ (గ్యాస్‌కు సంబంధిదించినది), ఫామ్ (క్రిమిసంహారక మందులకు విరుగుడు మందు), మెట్రోజల్ (యాంటీబయాటిక్), ఆక్సింటోసిన్(గైనిక్ ఇంజక్షన్), డైక్లోఫినాక్(పెయిన్ ఆయింట్‌మెంట్), పిప్‌ట్యాజ్ (యాంటీబయోటిక్ ఇంజక్షన్) తో పాటు పలు రకాల మందులు ఆస్పత్రిలో అందుబాటులోవు. చిన్నచిన్న జబ్బులకు సైతం బయట మెడికల్ షాపులకెళ్లి కొనుక్కోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైన సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్ర పరికరాలు లేకపోవడంతో గుంటూరు, తెనాలి ఆసుపత్రులకు రోగులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. వైద్యులు, టెక్నీషియన్లు, సిబ్బంది కొరత ఉంది. ఉన్నవారిలో కొందరు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో వైద్య సేవలు అందడంలేదు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకొనే ఆర్థిక స్థోమతలేని పేదలు తప్పనిసరి పరిస్థితిలో ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్నారు. ఇక్కడ సరైన వైద్య సేవలు అందకపోవడంతో ఏంచేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆసుపత్రిలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు అన్ని వసతులు సమకూర్చాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

బాపట్ల ఏరియా ఆసుపత్రిలో రోగుల అవస్థలు



ఆస్పత్రిలోని ఫార్మసీలో మందులు కొంటున్న రోగులు



బాపట్ల ఏరియా వైద్యశాల

గత ప్రభుత్వ హయాంలో పెరిగిన ఓపీ

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ. 4 కోట్లు వెచ్చించి బాపట్ల ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి చేశారు. అప్పటివరకు వందలోపే ఉన్న ఓపీ 300కు పెరిగింది. ఆ తర్వాత కూటమి పాలన వచ్చి ఆరునెలలు గడుస్తున్నా అభివృద్ధికి నిధులు కేటాయించలేదు.

మందుల కొరత పెద్దగా లేదు



వైద్యశాలలో మందుల కొరత పెద్దగా లేదు. కొన్ని మాత్రమే లేవు. సెంట్రల్ డ్రగ్‌స్టోర్ సరఫరా చేయని మందులను మేము లోకల్‌గా కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నాం. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఉంది. వాటిని భర్తీ చేస్తే ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించే అవకాశం ఉంటుంది.

–డాక్టర్ సిద్ధార్థ కొప్పుల, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల ,బాపట్ల

ఏరియా వైద్యశాలలో ప్రధాన సమస్యలు ఇవి..

- ప్రతిరోజు 350 నుంచి 400 ఓపీ ఉన్న బాపట్ల ఏరియా ఆసుపత్రిలో 23మంది డాక్టర్లకు గాను 20 మంది మాత్రమే ఉన్నారు. ఒక జనరల్ సర్జన్, ఇద్దరు జనరల్ మెడిసిన్, పెథాలజిస్ట్‌లు లేరు.
- ఎక్స్‌రేలో డార్క్‌రూం అసిస్టెంట్లు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్లు లేరు.
- గ్రేడ్ వన్ ఫార్మసిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది.
- 24 మంది నర్సులకుగాను 14 మంది మాత్రమే ఉన్నారు.
- సీటీ స్కాన్, ఎంఆర్ఐ లేక స్కానింగ్ అవసరమైనవారిని గుంటూరు ఆసుపత్రికి పంపుతున్నారు. అక్కడికి వెళ్లేందుకు అంబులెన్స్ లేకపోవడంతో పేషెంట్లు సొంత వాహనాలు సమకూర్చుకుని వెళ్లాల్సివస్తోంది. ఇది పేదలకు భారంగా మారింది.
- సెంట్రల్ డ్రగ్ స్టోర్ గుంటూరు నుంచి మందుల సరఫరా సక్రమంగా లేదు.
- మెడికల్ బడ్జెట్ రూ. 10 లక్షలు, సర్జికల్ బడ్జెట్ రూ. 3.90 లక్షలు రావాల్సి ఉన్నా అరకొరగా మాత్రమే ఇస్తున్నారు. దీంతో పేషెంట్లకు మందులు అరకొరగా ఇచ్చి మిగిలినవి బయట మెడికల్ షాపుల్లో కొనుక్కోమంటున్నారు.
- మృతదేహాలు పెట్టేందుకు తగినన్ని ఫ్రీజర్లు లేవు. రెండు మాత్రమే ఉన్నాయి. రెండు అదనంగా అవసరమని అధికారులు చెబుతున్నారు.
- ఆసుపత్రిలో వసతి తక్కువగా ఉండటంతో ప్రభుత్వ కార్యక్రమాలకు సరిపోవడంలేదు. స్థలం చూపిస్తే ఇతరత్రా వాటికి వైద్య పరికరాలు ఇచ్చే అవకాశముంది. ఉదాహరణకు ఎన్ఆర్‌సీ (న్యూట్రీషనల్ రీహేబిలిటేషన్ సెంటర్) ఏర్పాటుకు 1500 చదరపు అడుగుల స్థలం చూపించాలని ఉన్నతాధికారులు కోరుతున్నా చూపలేక పోవడంతో అది వెనక్కు పోతోంది.
- ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనం నాసిరకంగా ఉండడంతో పేషెంట్లు చాలా మంది బయట నుంచి తెచ్చుకొని తింటున్నారు. అయినా కాంట్రాక్టర్ ఆసుపత్రి వార్డుల్లో ఉంటున్న ఇన్‌పేషెంట్లు అందరికీ ఇస్తున్నట్లు బిల్లులు పెట్టుకుంటుండడంతో ఈ వ్యవహారం వివాదంగా మారింది.
- నిధులు లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది.

నిరుపయోగంగా ఎస్ఎన్‌సీ యూనిట్

- బాపట్ల ఆసుపత్రిలో స్పెషలైజ్డ్ న్యూబర్న్ కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీ) ఏర్పాటు చేసి చాలా కాలమైంది. పిల్లల కేరింగ్ కోసం వైద్యులు, నర్స్, సపోర్టింగ్ నర్స్ పోస్టులు, ఒక డీఈవో పోస్టు ఖాళీగా ఉండటంతో యూనిట్ రన్ చేయలేని పరిస్థితి.

జిల్లాలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

- నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మేరుగ
- పార్టీ సంస్థాగత నిర్మాణానికి చర్యలు
- యుద్ధప్రాతిపదికన కమిటీల ఏర్పాటు
- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటానికి సన్నద్ధం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున తెలిపారు. ఇందుకోసం పార్టీ సంస్థాగత నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. పార్టీ మండల, జిల్లా కమిటీల ఏర్పాటును యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసి కూటమి సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు. స్థానిక కోన భవన్‌లో బుధవారం సాయంత్రం జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో మేరుగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల, జిల్లా కమిటీల ఏర్పాటుపై నేతలతో చర్చించారు. కమిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతోపాటు అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. జిల్లాతోపాటు పార్టీ రాష్ట్ర కమిటీలోనూ కొందరికి స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. కమిటీల నిర్మాణం అనంతరం కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ ప్రత్యక్ష పోరాటానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి గద్దె నెక్కాక అమలు చేయకుండా ప్రజలను వంచించడంపై వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు మేరుగ నాగార్జున తెలిపారు. అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పార్టీ నేతలు కార్యకర్తలకు అండగా నిలుస్తారని ఆయన తెలిపారు. సమావేశంలో బాపట్ల సమన్వయకర్త కోన రఘుపతి, చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్, పర్చూరు సమన్వయకర్త యడం బాలాజీ తరపున ఆయన సోదరుడు దీపక్, అద్దంకి సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి తరపున ఆయన సోదరుడు నరసింహారెడ్డి హాజరయ్యారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు రంగం సిద్ధం

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- 7న బాపట్ల రానున్న సీఎం చంద్రబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 7న బాపట్ల జిల్లాకు రానున్నారని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి బాపట్ల జిల్లాలో ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మొట్టమొదటిసారిగా బాపట్లలో నిర్వహించడానికి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ ఈ సమావేశాలు జరుగుతాయని, ప్రజా ప్రతినిధులు పాఠశాలలకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల సమగ్ర ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చిస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు, విద్యా సంవత్సరంలో వారి పురోగతి, విద్యార్థుల ప్రవర్తన, నైతికత, నైపుణ్యాలు, క్రమశిక్షణ, ఇంట్లో, పాఠశాలలో వ్యవహరించే తీరుపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒకరికొకరు చర్చించుకునే గొప్ప అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చే అంశాలపై అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులు 919 మంది ఉన్నారన్నారు. కేవలం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎంపిక చేసిన పూర్వ విద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థులతో సీఎం ముఖాముఖి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడతారని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. అర్ధంతరంగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణాలను మొదట పరిశీలిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడతారన్నారు. మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి చేస్తారని వెల్లడించారు. తల్లులకు రంగవల్లులు, విద్యార్థుల తండ్రులకు నిర్వహించే టగ్గాఫ్ వార్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు: ఎస్పీ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ముఖ్యంగా హెలిప్యాడ్, బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆహ్వాన పత్రాలు, పాసులు ఉన్న వారిని మాత్రమే సభా ప్రాంగణంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సమాచార, పౌర సంబంధాలశాఖ సహాయ సంచాలకులు కె. సుభాషిణి, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 6నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. రెవెన్యూ గ్రామంలో సదస్సులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సదస్సులపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని తెలిపారు. సదస్సుల ద్వారా ప్రజల సమస్యలకు పూర్తిగా పరిష్కారం దొరకాలని సూచించారు. గ్రామాల వారీగా తహసీల్దార్లు షెడ్యూల్ ప్రకటించుకోవాలని ఆయన ఆదేశించారు. రీసర్వే పూర్తికాని గ్రామాల్లో ముందస్తుగా సదస్సులు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బాపట్ల జిల్లాలో 277 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 71 చోట్ల రీసర్వే పూర్తయిందని తెలిపారు. మిగిలిన 206 గ్రామాల్లో జరుగుతోందని పేర్కొన్నారు. రీ సర్వేపై నిర్వహించిన సభల్లో 4,230 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని, ఇందులో అందులో 1,009 కేవలం రెవెన్యూకి సంబంధించినవేనని వివరించారు. వీటిలో 40% అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

కూలీల బతుకుల్లో విషాదం

- ఆటోను ఢీకొట్టిన లారీ
- ఆరుగురు మహిళలకు గాయాలు
- ఓ మహిళకు తెగిపడిన ఎడమ చేయి
- పరిస్థితి విషమం





చీరాల వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలు (ఇన్‌సెట్‌లో) ప్రమాద స్థలంలో నుజ్జయిన ఆటో

చినగంజాం: పొట్టకూటి కోసం పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మహిళా కూలీలు తీవ్ర గాయాలపాలైన సంఘటన బుధవారం సాయంత్రం చినగంజాం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చినగంజాంకు చెందిన కూలీలు షేక్ పర్వీన్, షేక్ మస్తానీ, మేరీ, రేపూరి సుమలత, పులిపాటి జ్యోతి, గాలంకి ప్రసన్న, లలితమ్మ తదితరులు బుధవారం ఉదయం ఆటోలో వేటపాలెం సమీపంలోని ఓ ప్రయివేట్ రొయ్యల ఫ్యాక్టరీలో కూలీ పనుల నిమిత్తం వెళ్లారు. సాయంత్రం పనులు పూర్తయ్యాక ఇంటికి ఆటోలో తిరిగి వస్తున్నారు. మరికొద్దిసేపటిలో చేరుకుంటున్నారనే సమయంలో ఫ్లై ఓవర్ సమీపాన ఒంగోలు నుంచి చీరాల వైపు వెళుతున్న లారీ ఆటోను బలంగా ఢీ కొట్టడంతో అది బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న షేక్ మస్తానీకి ఎడమ చేయి తెగి వేరుపడిపోగా, తలకు తీవ్ర గాయమైంది. రేపూరి సుమలత, పులిపాటి జ్యోతిలకు తీవ్ర గాయాలయ్యాయి. షేక్ పర్వీన్, గాలంకి ప్రసన్న, లలితమ్మ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆటో డ్రైవర్ శ్రీనివాసరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న మస్తానీని మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. ప్రమాదానికి కారణమయిన లారీని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

అమ్మ ఇంకా రాలేదే?



తల్లిరాక కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

రాత్రి పొద్దుపోయేంత వరకు తల్లి ఇంటికి రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో చిన్నారులు ఎదురు చూస్తున్న ఘటన చూపరులను కలచి వేసింది. సాయంత్రం అయ్యేసరికి తమ వద్దకు చేరుకొని లాలించే తల్లి పొద్దు పోయేంత వరకు కనిపించక కన్నీరుమున్నీరవుతున్నారు. తన తల్లి గురించి ఇరుగుపొరుగు వారు మాట్లాడుకునే మాటలు వారికి అర్థంకాక బిక్క మొహాలతో ఎదురు చూస్తున్నారు. జాస్మిన్, మినహాజ్‌లు ఆ తల్లికి లేకలేక ఆలస్యంగా పుట్టిన సంతానమని స్థానికులు తెలిపారు.

క్లుప్తంగా

పంటల బీమాతో రైతులకు మేలు

రేపల్లె రూరల్: పంటలకు బీమాతో రైతులకు మేలు చేకూరుతుందని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. ఫసల్ బీమా, వాతావరణ బీమా యోజన తదితర పథకాలపై మండలంలోని కారుమూరు, మోర్లవారిపాలెం రైతు సేవా కేంద్రాల్లో బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ప్రీమియం రుసుంను కామన్ సర్వీస్ సెంటర్‌ను గానీ, రైతు సేవా కేంద్రాన్నిగానీ సంప్రదించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో బీమా నమోదు చేయించుకోవచ్చని సూచించారు. మొక్కజొన్న ఎకరానికి రూ.105, తెల్ల జొన్న ఎకరానికి రూ.38. పెసర పంటకు రూ.36, మినుము పంటకు రూ.60, వేరుశనగకు రూ.60 చెల్లించి రశీదు పొందాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటలలో రైతు ఖాతాలో నగదు జమ చేస్తారని తెలిపారు. వివరాలకు రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన సూచించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పర్యటన చేశారు. పంటల సంరక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై రెండు చోట్ల ఇద్దరు మృతి

తాడేపల్లి రూరల్: గుంటూరు ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ప్రాంతాల్లో ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. సీఐ అంజిబాబు తెలిపిన వివరాల ప్రకారం... తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలో ట్రాక్ పక్కన వ్యక్తి మృతి చెంది ఉండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెళ్లి పోలీసులు పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఎరుపు చొక్కా, నలుపు ప్యాంటు, జర్కిన్, కట్ వైట్ బనియన్ ఉన్నాయి. మంగళగిరి రైల్వే స్టేషన్ పరిధిలో ట్రాక్‌పై కూడా మరో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడకు వెళ్లారు. మృతుడి వయసు సుమారు 25 సంవత్సరాలు ఉండవచ్చు, ఒంటిపై నీలి రంగు జీన్స్ ప్యాంటు, నల్ల టీషర్టు, దానిపై చారల చొక్కాలున్నాయి. ఎవరైనా వీరిని గుర్తిస్తే 94406 27546, ఎస్ఐ రమేష్ 99083 83300 నెంబర్లలో సంప్రదించాలని సీఐ తెలిపారు.

తల్లిని పోషించని కుమారుడిపై బైండోవర్ కేసు

భూమిని స్వాధీనం చేసిన అధికారులు


విచారణ చేస్తున్న తహసీల్దార్, అధికారులు

జే.పంగులూరు: తల్లి పేరుతో ఉన్న భూమిని తీసుకొని ఆమెను పోషించని కుమారుడిపై బైండోవర్ కేసు నమోదు చేసి, ఆ భూమిని అధికారులు తిరిగి అప్పగించిన సంఘటన బుధవారం బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని కొండమూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోటపాడుకు చెందిన బత్తుల రామకోటి, శేషమ్మ దంపతులకు కుమారుడు శ్రీను ఉన్నాడు. రామకోటి కొద్దిరోజుల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. కొండమూరు గ్రామం సర్వే నంబర్ 2-1 లో 31 సెంట్ల భూమిని శ్రీను దౌర్జన్యంగా అక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడని, తన పోషణ చూడటం లేదని తల్లి బత్తుల శేషమ్మ గత నెల 11వ తేదీ బాపట్లలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంది. దీనిపై బుధవారం పంగులూరు మండల తహసీల్దార్ సింగారావు, ఎంపీడీఓ కె.స్వరూప రాణి, రేణింగవరం ఎస్ఐ వినోద్‌బాబు కొండమూరు వెళ్లి విచారణ చేశారు. బత్తుల శ్రీను తన తల్లికి చెందిన 31 సెంట్ల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడని నిర్ధారించి, ఎంసీ 47 ద్వారా అతనిపై బైండోవర్ చేయించారు. భూమిని అర్జీదారు బత్తుల శేషమ్మకు అప్పగించినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు.

బస్సులో బ్యాగ్ మరచిపోయిన మహిళ

- బెంగళూరు నుంచి పుట్టింటికి వస్తుండగా ఘటన
- బ్యాగ్‌లో ఎనిమిది సంవర్ల బంగారం, పాస్‌పోర్టు
- దొరికిన వారు అందజేయాలని వినతి

జే.పంగులూరు: బెంగళూరు నుంచి పుట్టింటికి వస్తూ విలువైన వస్తువులతో పాటు, పాస్‌పోర్టు కలిగిన బ్యాగును అర్ధరాత్రి బస్సులో ఓ మహిళ పోగొట్టుకుంది. వివరాల్లోకి వెళితే.. శిరిష పుట్టినిల్లు అయిన కొండమంజులూరుకు వచ్చేందుకు మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు బెంగళూరు నుంచి వైజాగ్ వెళ్లే రాజేష్ ట్రావెల్స్ (కెఏ 03 ఏఎం 7125) బస్సులో తన ఇద్దరి పిల్లలతో బయలుదేరింది. భర్త గోరంట్ల రామకృష్ణ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, ఆమె ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ బెంగళూరులో నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి 2.45 గంటల సమయంలో కొండమంజులూరు సమీపంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద నిద్రమత్తులోనే ఇద్దరి పిల్లలతో బస్సు దిగింది. అయితే, ఆమె సీటు పక్కనే పెట్టుకున్న విలువైన బ్యాగును మర్చిపోయింది. తనను తీసుకు వెళ్లేందుకు కారులో సిద్ధంగా ఉన్న తమ్ముడుతో కలిసి ఇంటికి వచ్చింది. ఆ రాత్రి నిద్రపోయింది. తెల్లారి లేచి తన సామగ్రి చూసుకోగా బ్యాగ్ మిస్ అయిందని గుర్తించి నిర్ఘాంత పోయింది. వెంటనే బస్సు డ్రైవర్‌కి ఫోన్ చేయగా మధ్యలో ఎంతో మంది దిగిపోయారని తామేమీ చేయలేమని తెలిపారు. లండన్ వెళ్లేందుకు ఈ మధ్యే పాస్‌పోర్టు వచ్చినట్లు తెలిపింది. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వనున్నట్లు బాధితురాలు తెలియజేసింది. బ్యాగ్ దొరికిన వారు 7661004251 నంబర్‌కి ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని విన్నవించింది.

విపత్తు సమయంలో అప్రమత్తత ముఖ్యం

గుంటూరు వెస్ట్: విపత్తు సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బుధవారం విజయవాడ నుంచి అధికారులతో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వరదల సమయంలో సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించాలన్నారు. తగిన సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. 67 రెయిన్ గేజ్‌లలో పనిచేయని 29 గేజ్‌లను రిపేరు చేయించాలన్నారు. సమావేశంలో జిల్లా విపత్తులు నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్‌టీఎఫ్ పాత్ర కీలకం

నగరంపాలెం: శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) కీలకపాత్ర పోషిస్తోందని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. నగరంపాలెం పీఎస్ పక్కనున్న ఎస్‌టీఎఫ్ కార్యాలయంపై సిబ్బంది విశ్రాంతి గదిని బుధవారం రేంజ్ ఐజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులు ముగిశాక విశ్రాంతి కోసం నూతన గదిని అందుబాటులోకి తేవడం అభినందనీయమని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌టీఎఫ్ సిబ్బందికి వసతుల కల్పన తమ బాధ్యత అని అన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఆర్ఐ (పరిపాలన) ఉదయ్‌భాస్కర్, సంక్షేమ ఆర్ఐ శివరామకృష్ణలను అభినందించారు. విశ్రాంతి తీసుకునేందుకు అధునాతన పరుపులతో మంచాలు, టీవీ, పుస్తకాలు, ప్రథమ చికిత్స కిట్లు, సామాన్లు భద్రపరుచుకునేందుకు వ్యక్తిగత లాకర్లు, బీరువాలు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి, డీఎస్పీలు బి.సీతారామయ్య (ఎస్‌బీ), రమేష్ (ట్రాఫిక్), నగరంపాలెం పీఎస్ సీఐ వీరనాయక్, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, ఉదయభాస్కర్, శివరామకృష్ణ, ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


విశ్రాంతి గది ప్రారంభిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి. చిత్రంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

అంతర్రాష్ట్ర వాహనచోరుడి అరెస్ట్

లక్ష్మీపురం: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు చేసినట్లు వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీ తెలిపారు. గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు కేసు వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి సుమారు రూ. 8 లక్షల విలువ చేసే వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారి కథనం ప్రకారం... పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణం, పురుషోత్తంపట్నానికి చెందిన వల్లెపు సత్యదాసు చెడు వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్నాడు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో పలు చోరీలు చేశాడు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ (క్రైం) కె.సుప్రజ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సుమారు 150 సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేశామని, వాహనాలను నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో వీఐపీ రోడ్డు చివర విక్రయిస్తున్నాడనే సమాచారంతో బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన గుంటూరు జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ, సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, వెస్ట్ డీఎస్పీ బి.ఎం.జయరామ్‌ప్రసాద్, నగరంపాలెం పీఎస్ సీఐ వీరానాయక్, సీసీఎస్ సీఐ ఎం.వి.సుబ్బారావు, నగరంపాలెం ఎస్సై షేక్ సలాం, సీసీఎస్ ఎస్సై ఎల్.రాములు, ఏఎస్సై కృష్ణస్వామి, హెచ్‌సీ విజయ్‌కుమార్, పీసీలు శ్రీక్రాంత్, షేక్ నజీర్, నగరంపాలెం సిబ్బంది పీసీలు ప్రేమకుమార్, క్రాంతి, వసంతరావు నాయక్‌లను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందనలు తెలిపారని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీలు జయరామ్‌ప్రసాద్, ఎ.శివాజీలు

నిజాయతీ చాటుకున్న సైకిల్ మెకానిక్

ఫోన్‌పేలో పొరపాటున పడిన రూ.లక్ష యజమానికి బదిలీ


రమణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.లక్ష పొరపాటున జమ అయ్యింది. బ్యాంకు ద్వారా వివరాలు తెలుసుకున్న ఆయన తిరిగి బుధవారం సదరు యజమానికి ఫోన్‌పేలో పంపి తన నిజాయతీ చాటుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం... ఉండవల్లి సెంటర్‌లో సైకిల్ మెకానిక్‌గా జీవనం సాగించే రమణ మంగళవారం బ్యాంకులో నగదు డ్రా చేయడానికి వెళ్లగా రూ.లక్ష అదనంగా కనిపిస్తున్నాయి. బ్యాంకు అధికారులను సంప్రదించగా ఒడిశా రాష్ట్రం మల్గరి గ్రామానికి చెందిన పంకజ్ మజ్హాహి ఖాతా నుంచి ఈ మొత్తం వచ్చినట్లు తెలిసింది. బ్యాంకులోనే పంకజ్ ఫోన్ నెంబర్ తెలుసుకుని ఫోన్ పే ద్వారా పంపించారు. పంకజ్ వచ్చీరాని ఆంగ్లంలో మాట్లాడుతూ.. ఈ నగదును తన పిల్లల చదువుల కోసం వేరే వారికి పంపించబోయి రమణకు పంపినట్లు చెప్పారు. తిరిగి పంపినందుకు ధన్యవాదాలు తెలిపారు. రమణ ఫోన్‌పేకు రూ.మూడు వేలు బహుమతిగా నగదు బదిలీ చేశారు.



ఫోన్‌పేలో చెల్లించిన దృశ్యం

డ్రైవర్ అనుచిత ప్రవర్తనపై కేసు నమోదు

మార్టూరు: సుమారు పది నెలల క్రితం మార్టూరులో జరిగిన ఓ సంఘటనపై బుధవారం మార్టూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఎస్ఐ షేక్ సైదా వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నాగరాజు పల్లి రోడ్డులో టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు అనంత గ్రానైట్ ఫ్యాక్టరీ ఉంది. ఇందులో తనిఖీల నిమిత్తం ఈ సంవత్సరం జనవరి 30వ తేదీ మైనింగ్ అధికారులు బాలాజీ నాయక్, ప్రతాపరెడ్డిల బృందం వచ్చింది. ఈ సందర్భంగా మైనింగ్ అధికారి ప్రతాపరెడ్డి కారు డ్రైవర్‌గా చెప్పే కె. శ్రీనివాసరావుకి, ఫ్యాక్టరీ యజమాని కామినేని జనార్దన్, ఇతర గ్రానైట్ అసోసియేషన్ సభ్యులతో వాగ్వాదం జరిగింది. విషయం తెలిసి పర్చూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ఘటనాస్థలికి చేరుకొని ఏం జరిగిందంటూ అధికారులతో మాట్లాడారు. ఏలూరిపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ శ్రీనివాసరావు దుర్భాషలాడాడు. ఏడీ ప్రతాపరెడ్డి కారు డిక్కీని తెరిచి చూడగా అందులో కారపు పొట్లాలు, కర్రలు ఉన్నాయి. అంతేకాక అధికారుల అండ చూసుకొని శ్రీనివాసరావు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని డబ్బులు డిమాండ్ చేశాడనేది కూడా మరొక ఆరోపణ.ఈ క్రమంలో బుధవారం ఫ్యాక్టరీ మేనేజర్ మామిడాల వేణుగోపాల్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

ఉపాధ్యాయులపై మానసిక దాడి ఆపాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులపై ప్రభుత్వం చేస్తున్న మానసిక దాడి ఆపాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఈ మేరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంఈవోలకు వినతి పత్రాలను సమర్పించినట్లు వారు తెలిపారు. ఏదో ఒక సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని రోజూ ఒత్తిడికి గురి చేయడంతోపాటు ఒక పని పూర్తి కాకముందే మరొకటి అప్పగిస్తున్నారని వాపోయారు. ఇతర విషయాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యాబోధన గురించి అసలు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం తీరు మార్చుకోవాలని పేర్కొన్నారు. బోధనేతర బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరిన్ని పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

కూలిన చప్టా పరిశీలన

- శాశ్వత నిర్మాణ పనులను పర్యవేక్షించిన అధికారుల బృందం
- ప్రస్తుతం ఒక తడికి సాగునీరు అందిస్తామని హామీ


కూలిన చప్టాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ సిబ్బంది

భట్టిప్రోలు: వెల్లటూరు చానల్ పరిధిలో భట్టిప్రోలు మెయిన్ డ్రైయిన్‌పై కూలిన చప్టా స్థానంలో చేపట్టనున్న శాశ్వత నిర్మాణ పనుల్ని పర్యవేక్షించేందుకు ఇరిగేషన్, ఇంజనీరింగ్ శాఖాధికారులు బుధవారం వచ్చారు. ఇరిగేషన్ ఎస్ఈ పి. వెంకటరత్నం ఆధ్వర్యంలో డీఈలు సత్యనారాయణ, దీన్‌దయాళ్, అనిల్ కుమార్, ఐ. ధనలక్ష్మి, ఈఈ సత్యవతి, జేఈలు సువర్చల, అనూష, కృష్ణ చైతన్య, నాగూర్‌లతో పాటు డిజైనింగ్ ఆర్గనైజేషన్ అధికారులు బృందం చప్టాను పరిశీలించింది. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కాల్వ ద్వారా భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి ప్రాంతాల్లోని 30 వేల ఎకరాలకు పైగా పంట పొలాలకు సాగునీరు అందుతుంది. చప్టా కూలిపోవడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. ముఖ్యంగా నగరం మండలం దిగువ ప్రాంతంలో 10 వేల ఎకరాలకు పైగా పైరు లేత దశలో ఉండటంతో సాగునీరు అవసరమైంది. చప్టా ధ్వంసం కావడంతో ఈ చానల్ పరిధిలో ఏటీఎస్, న్యూ వేమవరం చానళ్లలో సాగునీటి సరఫరా నిలిపి వేశారు.

యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు

ప్రస్తుతం కూలిన చప్టాకు యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి సాగు నీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో పనులకు ఒకింత అంతరాయం కలిగింది. ప్రస్తుతం దిగువకు ఒక తడి సాగు నీరు అందించేందుకు చప్టా వద్ద ఇసుక బస్తాలతో నింపి, నీరు లీక్ కాకుండా టార్పాలిన్ పట్టాలు వేసే ప్రయత్నంలో ఉన్నారు. అయితే, వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలకు దిగువున ఉన్న లేత వరి పైర్లకు కొంత మేర ఊరట కలిగించింది. మరో వారం రోజుల్లోపు పనులను పూర్తి చేసి సాగు నీరు అందించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ సువర్చల తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

బాపట్ల: ఇసుక అక్రమ తవ్వకాలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి సూచించారు.స్థానిక పటేల్‌నగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీకి విన్నవించినట్లు చెప్పారు. రేషన్ డీలర్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కొన్నిచోట్ల వారిపై ఒత్తిళ్ల పెంచిందని గాదె వివరించారు.చిన్న,చిన్నవారిపై కక్షసాధింపులు, కేసులు నమోదు చేయడాన్ని కూటమి ప్రభుత్వం మానుకోవాలని ఆయన సూచించారు. బాపట్లలో నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు మొదలు పెట్టించాలని సూచించారు.బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల్లో తన హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను గాదె వెంకటరెడ్డి గుర్తు చేశారు. బాపట్ల నియోజకవర్గంలో రూ.1400కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. పేద రైతులకు 2200మందికి ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటంతో ఎంతో మేలు జరిగిందని, నివేశన స్థలాలు విషయంలో కూడా ప్రత్యేక చొరవ తీసుకున్నామని చెప్పారు. ఆయనతో పాటు జి.విజయ్ ఉన్నారు.

మూల్యాంకనంలో పొరపాట్లకు తావివ్వరాదు

ఏఎన్‌యూ వర్సిటీ యూజీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణారావు


మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కృష్ణారావు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా డిగ్రీ మూల్యాంకనం నిర్వహించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూజీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.కృష్ణారావు తెలిపారు. వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వర్సిటీ డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం డాక్టర్ కృష్ణారావు సందర్శించారు. కళాశాలలోని మూల్యాంకన కేంద్రం స్ట్రాంగ్ రూమ్, జవాబు పత్రాల పంపిణీ గది, అధ్యాపకులకు కల్పించిన వసతులు స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూల్యాంకనంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని చెప్పారు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం కొనసాగాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్స్ విజేత రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత

ముగిసిన ఎడ్ల పోటీలు


ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, ప్రజా ప్రతినిధులు

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు బుధవారం ముగిశాయి. సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీలను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. మాచర్ల ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మనందరెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు అశోక్‌రెడ్డి, నరేంద్రవర్మ తదితరులు తిలకించారు. సీనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా సిరివేళ్ల మండలం గంపుమాందిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత 2,665 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత 2,651 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష్ చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత తృతీయ స్థానంలో, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత నాలుగో స్థానంలో, నంద్యాల జిల్లా సివేళ్ల మండలం గంపుమాందిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి మరో ఎడ్లజత ఐదవ స్థానంలో, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం త్రిషక్షరెడ్డి, జశ్వంతారెడ్డి ఎడ్ల జత ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను దాతలు సంగినేడి బాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ పంగులూరి పుల్లయ్య, కొండపల్లి అమరలింగేశ్వరరావు, గోరంట్ల నాగేశ్వరరావు, గోరంట్ల శివశంకర్, తండా మస్తాన్‌జాని, ఎస్వీఆర్ కృష్ణ, ఎస్.వి. సుబ్రమణ్యం, కల్లుట్ల రమేష్; మాడిశెట్టి నరసింహారావు, ట్రాక్టర్ జాని అందించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల ఆకస్మిక తనిఖీ

నరసరావుపేట: గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి తెలుసుకునేందుకు మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ బుధవారం నరసరావుపేట, చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రులను అకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రులలో అందిస్తున్న సేవలను నేరుగా రోగులను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. మందుల గదులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆర్‌సీహెచ్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న సేవలను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని హెచ్‌ఎంఐఎస్ స్టేట్‌మోడల్ ఆఫీసర్ శివశంకర్‌బాబు ఏరియా ఆస్పత్రుల సూపరిండెంట్లకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం కావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. తనిఖీలో స్టేట్ ఇమ్యూనైజేషన్ మోడల్ ఆఫీసర్ డాక్టర్ దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ గీతాంజలి, నీలకంఠేశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పాల్గొన్నారు.


మందుల గదిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డైరెక్టర్ అనిల్‌కుమార్